ఇవ్వాళ పొద్దున్నే. దాంతో ఆఫీసుకి వెళ్ళాల్సి వచ్చింది. అయినా మనకి తెలుసుగా ఆఫీసుల్లో పనులు ఎలా ఉంటాయో! నాకు ఎన్నోసార్లు పని పడి సెలవురోజుల్లో కూడా వెళ్ళాను. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నప్పుడు చిన్న చిన్న ఇబ్బందులు తప్పవు! పెళ్ళి కాక ముందు అమ్మ చేసినట్టే భార్య కూడా చెయ్యాలంటే ఎలా కుదురుతుంది? ఆఫీసులో మనతో సమానమైన పని చేస్తూ, ఇంట్లో మనకి రెట్టింపు పని చేస్తారు ఈ ఆడ వాళ్ళు! సహాయం చేసినా చెయ్యకపోయినా కనీసం అర్థం చేసుకొనే స్వభావం మన మగవాళ్ళకి లేకపోతే ఇంట్లో ఆనందం కరువైపోతుంది. నీకు తెలీదని కాదు! ఏదో నా మనసులో మాట చెప్తున్నా" అన్నాడు రవి.

పెళ్ళయ్యాక మొదటిసారి తన తప్పు తెలుసుకున్నాడు ఆనంద్. ఇన్నాళ్ళూ ఇంట్లో పూచికపుల్లయినా పక్కన పెట్టలేదు తను. పాపం నమిత అంత పనీ తనే చేస్తోంది. దానికి తోడు తన సణుగుళ్ళు భరిస్తోంది. నమితను అర్థం చేసుకోకుండా తనని కష్టపెట్టానని బాధపడ్డాడు ఆనంద్.

ఆలోచనల్లో పడిన ఆనంద్‌ని చూసి తన లక్ష్యం నెరవేరినందుకు సంతోషించాడు రవి. బావలో కలిగిన మార్పు కలకాలం ఉండాలని, వాళ్ళ కాపురం ఆనందంగా సాగిపోవాలని మనసులోనే దేవుడికి దండం పెట్టుకున్నాడు.

**-సిరి** (హైదరాబాద్)

# రేపటి మహిళ



రాజారావు బ్రతికున్నంత వరకు రుక్మిణికి పనుల మీద వీధిలోకి వెళ్ళే అవసరం కలుగలేదు. భర్త కేన్సర్‌తో మరణించడం వల్ల కుటుంబ భారం రుక్మిణి నెత్తిన పడింది.

అత్తని తోడు తీసుకుని భర్త పనిచేసిన ఆఫీసుకి వెళ్ళింది. అంతా సానుభూతి చూపించారు. రుక్మిణి తొమ్మిదో తరగతి చదువుతూ పెళ్ళవడంతో చదువు మానేసింది. క్వాలిఫికేషన్ ఏదీ లేదు గనుక ఆఫీసులో అటెండర్ పోస్ట్ ఇస్తారని చెప్పారు. రుక్మిణి తనకు అటెండర్‌గా అపాయింట్‌మెంట్ ఇవ్వమని అప్లికేషన్ పెట్టి ఆఫీసర్‌కి ఇచ్చి నమస్కారం చేసి వచ్చింది.

రాజారావు జబ్బునపడి ఎక్కువరోజులు సెలవులో వుండడంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. జాగ్రత్తగా డబ్బు ఖర్చుపెట్టుకుంటూ ముసలి అత్త, ఇద్దరి పిల్లలతో కాలక్షేపం చేస్తూ వుద్యోగం కోసం ఎదురు చూస్తూ వుంది రుక్మిణి.

ఒక రోజు ఆఫీసు నుంచి ఆమె పేరున కవరు వచ్చింది. ఆఫీసులో వున్న అటెండర్ పోస్టు వికలాంగులకు రిజర్వేషన్ చేయబడినది అని అందులోని సారాంశం.

అదే వీధిలో వుండే సీతారామయ్య వేరే ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్. ఆయనకు ఆఫీసు నుంచి వచ్చిన లెటర్ చూపించింది రుక్మిణి.

"ఆఫీసు వాళ్ళు రాసింది తప్పు. అటెండర్ల వుద్యోగాలలో వికలాంగులకు రిజర్వేషన్ వుండదు. మరి వాళ్ళు తెలిసి రాశారో, తెలియక రాశారో నేను జవాబు రాసిస్తాను. రేపు ఆఫీసుకి వెళ్ళి ఇవ్వు. ఏమంటారో చూద్దాం?" అన్నాడు సీతారామయ్య.

"సార్! నాకు ఉద్యోగం రాకపోతే చాలా కష్టం. ఇవ్వకపోతే ఏం చేయాలి?"

"నీకు ఏదోక వుద్యోగం ఇవ్వాలి. ఈ వూళ్లో కాకపోతే జిల్లా కలెక్టర్‌కు రాస్తే ఏ వూళ్ళో ఖాళీ వుంటే ఆ వూళ్లో ఇస్తారు. ఉద్యోగం రాదని భయపడకు"

"ఒంటరిదాన్ని సార్! ఈ వూళ్ళో పదేళ్ళ నుంచి వుంటున్నాను. అంతా తెలిసిన వాళ్ళు. పరాయి వూరికెళ్ళి బతకలేను" అని కన్నీళ్ళు పెట్టుకుంది రుక్మిణి.

సీతారామయ్య నిట్టూర్చారు.

మర్నాడు సీతారామయ్య రాసిచ్చిన అప్లికేషన్ తీసుకెళ్ళి ఆఫీసర్ చేతికి ఇచ్చింది. అది చదివిన ఆఫీసర్ ముఖం కోపంతో ఎర్రబడింది. గుడ్లురిమి చూసి అప్లికేషన్ విసిరి ఆమె ముఖం మీదకు కొట్టాడు.

"ఐతే మాకు రూల్స్ తెలియవన్నమాట!" అన్నాడు.

ఆమెకు దుఃఖం ముంచుకొచ్చి ఆఫీసర్ చాంబర్ నుంచి బైటకువచ్చి ఏడుస్తోంది.

"ఏమైందమ్మా ఏడుస్తున్నావు?" అటెండర్ శివయ్య అడిగాడు.

రుక్మిణి జరిగినదంతా చెప్పింది.

"గుమాస్తాలు ఏది రాస్తే అయ్యగారు అదే కరక్టు అనుకుంటారు. ఒకసారి సూపర్నెంటుని కలువు" అన్నాడు శివయ్య.

"బాబాయ్! నువ్వొకసారి సూపర్నెంటుతో మాట్లాడు నా తరపున" అన్నది రుక్మిణి.

"సరే" అని శివయ్య రుక్మిణిని తీసుకెళ్ళి సూపర్నెంటుని కలిశాడు. కాసేపు ఏదో మాట్లాడాడు.

"సూపర్నెంటు ఏమన్నాడు బాబాయ్?" ఆతృతగా అడిగింది రుక్మిణి.

"ముసుగులో గుద్దులాట ఎందుకమ్మా! అసలు సంగతి చెప్పనా?" అన్నాడు శివయ్య.

"చెప్పు బాబాయ్!"

"డబ్బులిస్తే నీకు వుద్యోగం ఇస్తారు"

రుక్మిణి గుండెలో రాయి పడింది.

"డబ్బు ఇవ్వాలా?"

శివయ్య తల వూపాడు.

భర్త చనిపోతే భార్యకు వుద్యోగం ఇవ్వడానికి డబ్బు ఇవ్వాలా? కుటుంబం చితికిపోకుండా సహాయం చేయడం కోసం ప్రభుత్వం వుత్తర్వులు ఇస్తే దానికి కూడా లంచం ఇవ్వాలా? శవాలపై డబ్బు ఏరుకోవడం అంటే ఇదేనేమో?

"బాబాయ్! నా దగ్గర డబ్బు లేదు. పైగా ఆయన జబ్బు కోసం చేసిన అప్పులున్నాయ్" ఏడుస్తూ అన్నది రుక్మిణి.

శివయ్య ఓదార్చాడు.

కొన్ని రోజుల తర్వాత ఆఫీసు నుంచి ఆమెకు ఒక లెటర్ వచ్చింది.

"ఆఫీసులో నీ క్వాలిఫికేషన్‌కి ఇవ్వదగిన వుద్యోగాలు ఏమీ లేవు. లైట్ వెహికల్ డ్రైవర్ వుద్యోగం మాత్రమే ప్రస్తుతం ఖాళీ వుంది" అని దాని సారాంశం.

రుక్మిణి వెక్కి వెక్కి ఏడ్చింది. నిస్సహాయ స్థితిలో కోపం ముంచుకొచ్చి సర్కారీ లెటర్ చించి ముక్కలు చేసింది.

రెండు నెలల తర్వాత రుక్మిణి ఆఫీసుకి వెళ్ళింది. ఆమెను చూసి అంతా నోరెళ్ళబెట్టారు. శివయ్య ఆమెను గుర్తుపట్టనే లేదు. శుభ్రంగా క్రాఫ్ చేయించుకుని ప్యాంటు, షర్టు తొడుక్కుని బూట్లు చప్పుడు చేసుకుంటూ ఆఫీసర్ చాంబర్‌లోకి వెళ్ళి అప్లికేషన్ ఇచ్చింది.

"అయ్యా! మీ ఆఫీసులో నాకు ఇవ్వదగిన ఏకైక ఖాళీ లైట్ వెహికల్ డ్రైవర్ ఉద్యోగం ఇవ్వండి. నా డ్రైవింగ్ లైసెన్స్ దీనితో జతపరిచాను"

అది చదివి ఆఫీసర్ కళ్ళు పెద్దవి చేసి రుక్మిణిని ఎగాదిగా చూశాడు.

**-వాణిశ్రీ**